వాడిపోతున్న పత్తి

• వేసవిని తలపిస్తున్న ఎండలు • నీరులేక ఎండిపోతున్న పంట • ఆందోళనలో అన్నదాత



ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు ఎంద్రాల్యల బాబు రావు, జయవరం గ్రామానికి చెందిన ఈ రైతు 12 ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాడు. వర్షాలు లేక వేసిన పత్తి పంట రోజు రోజుకు వాడిపోతోంది. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టిన ఈ రైతు సరైన సమయంలో పంటకు నీరందక ఆందోళన చెందుతున్నాడు. 'ఒక్కసారైన వచ్చిపో..' అంటూ వర్షం కోసం పరితపిస్తున్నాడు. ఇది కేవలం ఈ రైతు పరిస్థితే కాదు.. నాన్ కమాండ్ ఏరియాలో ఉన్న రైతులందరి పరిస్థితి.

వేములవాడరూరల్: భూమిని నమ్ముకుని.. దేవునిపై భారం వేసి పంట బాగా సాగుకావాలని రైతన్న ఆరుగాలం కష్టపడుతాడు. ప్రకృతి సహకరించకుంటే చేసేది లేక మౌనంగా రోదిస్తాడు. ఇది ప్రస్తుతం నాన్ కమాండ్ ఏరియాలో పత్తి రైతులు అనుభవిస్తున్న బాధ. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఈసారి ధోకా లేదని, పంట చేతికి వస్తుందని, అప్పులన్నీ తీరుతాయని అనుకుంటుండగా, విపరీతమైన ఎండలకు కళ్లముందే పత్తి పంట వాడిపోతుంటే, పూర్తిగా ఎండిపోతుందా.. అనే ఆందోళనతో వర్షం కోసం ఎదురుచూస్తున్నాడు.



పత్తి సాళ్లు దున్నుతున్న రైతన్న

ఈ సంవత్సరం పత్తి పంట మెరుగ్గా ఉందని సంబరపడిన రైతన్నకు వర్షాలు లేక ఎండిపోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వేసవిని తలపించే ఎండలు కొట్టడంతో పత్తి పంట రోజురోజుకు వాడిపోయి కాయ కూడా ఎదుగుదల లేక నిలిచిపోయిందని అంటున్నారు. నీటి కొరత ఉన్న రైతులు ప్రధానంగా ఆరుతడి పంటలపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటున్నారు. ఇందులో ప్రధానంగా పత్తి, మక్క, ఇతర పంటలపై ఎక్కువ దృష్టి పెడతారు. వేములవాడ రూరల్ మండలంలో 17 గ్రామాలు ఉండగా, వీటిలో 4 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. అర్బన్ మండలంలో 11 గ్రామాల్లో 3 వేల ఎకరాలు సాగు చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సంవత్సరం వర్షాకాలం ప్రారంభంలో అనుకూలంగా ఉన్న వర్షాలు ఈ మధ్యకాలంలో మొఖం చాటేయడంతో కాత కాయ దశకు రావడంతో భూమిలో నీరు సరిపోక చెట్లన్నీ ఎండిపోతున్నాయి. నేడో రేపో వర్షం వస్తే పత్తి పంటకు అనుకూలమని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.



ఎండలకు నీరు లేక వాడిపోతున్న పత్తి పంట

సాళ్లు దున్నుతున్న రైతులు

వర్షం వస్తే పత్తి పంటలో నీరు నిల్వ ఉండేందుకు వీలుగా కొంతమంది రైతులు నాగళ్లతో పత్తి చేను సాళ్లు దున్నుతున్నారు. మరికొంత మంది రైతులు నీటి సౌకర్యం ఉండగా పత్తి పంటకు నీరు పట్టి కొంత పంటను కాపాడే ప్రయత్నం చేసుకుంటున్నారు. కాని పూర్తిగా నీటి సౌకర్యం లేని రైతులు మాత్రం దేవునిపైనే భారం వేసి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.

వర్షంపైనే ఆధారం



ఈ సమయంలో పత్తి పంటకు వర్షం చాలా అవసరం. వేలాది రూపాయల పెట్టుబడులతో పత్తి సాగు చేస్తున్నాం. నాకున్న 10 ఎకరాల్లో సాగు చేసిన పంటకు నీరు లేక ఎండ తీవ్రతతో ఎదుగుదల లేక వాలిపోతోంది. ఇలాగే మరో 10 రోజులు ఉంటే రైతన్నలకు కష్టకాలమే. వర్షం వస్తే నీరు నిల్వ ఉంటుందని నాగళ్లతో చాళ్లలో దున్నుతున్నా.

– చెట్టిపల్లి రవి, రైతు, జయవరం

మరో 10 రోజులు ఏం కాదు



ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు చాలా అవసరం. కానీ గత 2, 3 రోజులుగా చలి పెరిగింది. ఇలాగే ఉంటే పత్తి పంటకు ప్రమాదం ఏమీ కాదు. మరో 10 రోజులు రేగడి నేలలో ఉన్న పత్తి పంటకు ఇబ్బందులు ఏమీ ఉండవు. చలితో ఎదుగుదల ఉంటుంది.

– సాయికిరణ్, ఏవో, వేములవాడ

క్లుప్తంగా

సీఎం కేసీఆర్ సభకు తరలిరండి

• గ్రామాల్లో సన్నాహక సమావేశాలు



మాట్లాడుతున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించ తలపెట్టిన ప్రజా ఆశీర్వాద సభకు ఎల్లారెడ్డిపేట మండలం నుంచి 16 వేల మందిని తరలిస్తున్నట్లు, పెద్ద ఎత్తున తరలి వచ్చి బహిరంగ సభను విజయవంతం చేయాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్ కుమార్ అన్నారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాజన్నపేట, బుగ్గరాజేశ్వరతండా, అక్కపల్లి, దుమాల గ్రామాల్లో కార్యకర్తలతో శుక్రవారం సన్నాహక సమావేశాలు నిర్వహించారు. రాజన్నపేటలో ఏఎంసీ చైర్మన్ మోహన్ కుమార్, డైరెక్టర్ నర్సింలును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు సంక్షేమ పథకాలు దరిచేరడానికి మూడోసారి ముచ్చటగా కేసీఆర్‌ను సీఎంగా చేయాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి కేవలం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. సభకు పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందే సుభాష్, కొండ రమేశ్, శ్రీనివాస్, కిషన్, ఎల్లయ్య, తిరుపతినాయక్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అమృత్ కలశ్ యాత్ర



అమృత్ కలశ్ యాత్రలో వలంటీర్లు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేరీ మట్టి.. మేరా దేశ్ ప్రోగ్రామ్‌లో భాగంగా అమృత్ కలష్ యాత్ర నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.రాజగోపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి కనుకయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



కండువా కప్పుతున్న గోపాల్‌రావు

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు సాధ్యమని రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కల్వకుంట్ల గోపాల్‌రావు అన్నారు. మండలం చీకోడులో శుక్రవారం వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ పదేళ్లలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశంలో ఎక్కడా జరగలేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, 24 గంటల ఉచిత విద్యుత్, ఆసరా పింఛన్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, బతుకమ్మ చీరలు, కంటి వెలుగు వంటి పథకాలు ఎన్నో అమలు చేశారన్నారు. అంతటా బీఆర్‌ఎస్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్, మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, ఉపసర్పంచ్ నాగరాజుగౌడ్, బత్తుల అంజయ్య, మనోహర్, వెంకటస్వామి, రాజు, శ్రీనివాస్, యాదగిరిగౌడ్, దేవేందర్ పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో బతుకమ్మ



వేములవాడ: రాజన్న ఆలయంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వైశ్యులు అమావాస్యకు ఐదు రోజుల ముందు ప్రతి ఇంట్లో మట్టితో శ్రీచక్రాకృతిపై గౌరమ్మ రూపంలో బొడ్డెమ్మను చేసి, చుట్టూ చేరి పాటలు పాడుతూ బొడ్డెమ ఆట ఆడుతారు. ఐదో రోజు బొడ్డెమ్మను, బతుకమ్మను రాజన్న ఆలయానికి తీసుకువచ్చి ఆట ఆడి ధర్మగుండంలో నిమజ్జనం చేస్తారు. ఎల్లారెడ్డిపేట: ఆర్యవైశ్య భవన్‌లో ఆర్యవైశ్య మహిళలు బొడెమ్మ, బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.

చిత్రకథ



ప్రమాదకరంగా రహదారి

కోనరావుపేట మండలం కొలనూర్‌లో ప్రధాన రహదారిపై గుంత ప్రమాదకరంగా మారింది. సిరిసిల్ల-కోనరావుపేట ప్రధాన రహదారిపై కొలనూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు అదుపుతప్పుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని నెలలుగా ఇలాగే ఉంటున్నా స్థానిక ప్రజాప్రతినిధులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు ఉన్నాయి. రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి రహదారిపై మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

- కోనరావుపేట

గిరిజనుల రిజర్వేషన్ అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం

• గిరిజనులకు అండగా ఉంటాం
• కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీని మరిచిపోయిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండా, మొర్రాపూర్ తండాలలో శుక్రవారం పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి మహేందర్‌రెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గిరిజన గూడాలను అభివృద్ధికి దూరం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పోడు భూముల పట్టాలిస్తామని గిరిజనులను మోసం చేసిన బీఆర్‌ఎస్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. వీర్నపల్లి మండలంలో 15 వందల మంది పోడు భూముల కోసం దరఖాస్తులు చేసుకుంటే ఏడు వందల మందికి కూడా ఇవ్వలేదన్నారు. గిరిజనులకు రిజర్వేషన్లు కల్పించకుండా, పోడు భూముల పట్టాలు ఇవ్వకుండా వారికి అన్యాయం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆరు హామీలను అమలు చేసి, గిరిజన తండాలను అభివృద్ధి చేసి వారికి అసైన్డ్ భూములు పంచడం జరుగుతుందన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్, ముణ్యానాయక్, కొండల్‌రెడ్డి, బాల్‌రెడ్డి, భానుచందర్, గజ్జెల రాజు, ప్రశాంత్, దేవయ్య, కిషన్, నర్సింలు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న సురేశ్

ముస్తాబాద్: జనాభాలో 20 శాతం ఉన్న బీసీలు ఐక్యంగా రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి ఈడు గురాళ్ల సురేశ్ అన్నారు. ముస్తాబాద్‌లో బీసీ యువజన సంఘం సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. సురేశ్ మాట్లాడుతూ బీసీల ఒక్కటిగా లేకపోవడంతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కరు కూడా సీఎం కాలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా ప్రకారం చట్టసభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బీసీల హక్కుల కోసం ఈనెల 15న కాచీగూడలో జరిగే బీసీల మహాసభలకు వేలాదిగా తరలిరావాలన్నారు. బీసీ యువజన కన్వీనర్ చిగురు వెంకన్న, పాకాల శ్రీకాంత్, పెద్దూరి శ్రావణ్, మహిపాల్, సాంకేత్, వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఫ్రెషర్స్ డే

రుద్రంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి.

నిత్యావసరాలు అందజేత

ఎల్లారెడ్డిపేట: అనారోగ్యంతో మృతిచెందాడు. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడి కుమారుడు వారి కుటుంబానికి హెల్పింగ్‌సొసైటీ శుక్రవారం నిత్యావసర సరుకులు, రూ.2,500 నగదు అందజేశారు. అలాగే మండలంలోని రాచర్లబొప్పాపూర్‌కు చెందిన గుగ్గిల్ల నర్సయ్య కుటుంబానికి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండాపురం బాల్‌రెడ్డి నిత్యావసర వస్తువులు, రూ.5 వేల నగదును అందించారు. రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన మోహన్‌కుమార్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు పరామర్శించారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి పాల్గొన్నారు.

మాజీ ఉపసర్పంచ్ మృతి

ముస్తాబాద్: మండలంలోని చిప్పలపల్లి మాజీ ఉపసర్పంచ్ పారిపెల్లి నాంపెల్లి(70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు.

డేకేర్ సెంటర్‌కు తరలింపు

ఎల్లారెడ్డిపేట: గంభీరావుపేట మండలం కొత్తపల్లిలోని బస్టాండ్‌లో తలదాచుకుంటున్న అదే గ్రామానికి వేదాంతి పద్మావతి(99), వేదాంతి గోపాలాచారి(70) పరిస్థితి తెలుసుకొని ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాలరాజుయాదవ్, గంభీరావుపేట ఎస్సై మహేశ్ స్థానిక డే కేర్ సెంటర్‌కు తరలించారు. కట్టుబట్టలతో ఉంటున్నామని గోపాలాచారి తెలపగా.. బాల్‌రాజ్‌యాదవ్ స్పందించి వృద్ధులకు నూతన వస్త్రాలు అందించారు. మందులు సైతం ఇప్పిస్తామని వారికి భరోసానిచ్చారు.

గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం

తంగళ్లపల్లి: మండలంలోని కస్బేకట్కూర్, చింతపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ ఆరు గ్యారంటీల గురించి గ్రామస్తులకు వివరించారు. నాయకులు మునిగెల రాజు, అరెపల్లి బాలు, భరత్ గౌడ్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొర్ర రవీందర్, జిల్లా కార్యదర్శి నాగండ్ల భూమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం దళితులను మరిచిపోయింది

వీర్నపల్లి: రాష్ట్ర ప్రభుత్వం దళితులను పూర్తిగా మరిచిపోయిందని జిల్లా దిశ కమిటీ సభ్యులు బట్టు పీర్యా ఆరోపించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఏఎంసీ డైరెక్టర్లకు సన్మానం

ముస్తాబాద్: ఏఎంసీ డైరెక్టర్లుగా నియామకమైన ముక్క మల్లయ్య, రాజులను ముస్తాబాద్ పట్టణ బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం సన్మానించారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం

వేములవాడరూరల్: వేములవాడ నియోజకవర్గ బీజేపీ పార్టీ అభ్యర్థిగా ఉన్న నాయకున్ని భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శులు పరమేష్, చెట్టిపల్లి రవికిషోర్, అనిల్, తిరుపతి పాల్గొన్నారు.

యోగాశ్రమంలో సత్సంగం

బోయినపల్లి: మండల కేంద్రంలోని శ్రీ పరమహంస శాంతానంద యోగాశ్రమంలో శుక్రవారం మాసవారి సత్సంగం నిర్వహించారు. మొదట శాంతి హోమం చేశారు. ముక్తానందస్వామి ప్రవచనాలు వినిపించారు.

విద్యాలయాల్లో విరుల పండుగ



బాలికల ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో బతుకమ్మ సంబరాలు ముందస్తుగా జరుపుకున్నారు. సెస్ బాలికల జూనియర్ కళాశాలలో శుక్రవారం తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను కళాశాల ఆవరణలో ఉంచి ఆటపాటలతో అటు విద్యార్థులు, ఇటు అధ్యాపకులు సందడి చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వనజాకుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవడం ఆచార వ్యవహారాలను తరువాతి తరానికి తెలియజేసేందుకు వేడుకలు నిర్వహించామన్నారు. వేడుకల్లో లెక్చరర్లు దీప్తి, సునీత, అఫ్రోజ్ సుల్తానా సునీత, అనిత శ్రీదేవి, స్వప్న , సౌజన్య, సీతారామాంజనేయులు, శ్రీనివాస్, ప్రవీణ్, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

విజ్ఞాన్ హైస్కూల్‌లో....

పట్టణంలోని వెంకట్రావునగర్‌లోని విజ్ఞాన్ హైస్కూల్‌లో నిర్వాహకులు బొద్దుల సుదర్శన్, శ్రీగాధ గణేశ్, కూనపులి సురేందర్, శ్రీనివాస్, సత్యనారాయణ, స్థానిక అశోక్‌నగర్‌లోని వివేకానంద విద్యానికేతన్‌లో కరెస్పాండెంట్ దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, సెస్ డైరెక్టర్ దిడ్డి రమాదేవి, కౌన్సిలర్ దిడ్డి మాధవి పాల్గొన్నారు. అనంతరం ఊరేగింపుగా వెళ్లి మానేటి జలాల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఆనంద్ విద్యానికేతన్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ బిల్ల ఆనందం, బిల్ల చంద్రమౌళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపాల్ లక్కిరెడ్డి సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.



గంభీరావుపేటలో..

సమాచారం

15న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

సిరిసిల్లఅర్బన్: రాజన్న సిరిసిల్ల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి తెలంగాణ రాష్ట్ర 9వ జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ తెలిపారు. అండర్ 14, 16, 18, 20 బాల బాలబాలికలకు పలు క్రీడా విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని, ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. మిగతా వివరాలకు 79014 64456 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

అందుబాటులో శెనగలు

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రోస్ సెంటర్‌తో పాటు, మండలంలోని వెంకట్రావుపల్లి కేడీసీఎంఎస్ కేంద్రంలో శెనగలు అందుబాటులో ఉన్నట్లు ఎంఏవో ప్రణిత తెలిపారు. 25 కేజీల బస్తాకు రూ.1,875 ఉంటుందని పేర్కొన్నారు. అవసరం ఉన్న రైతులు శెనగలు తీసుకెళ్లాలని సూచించారు.

నియామకం

పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మధు, నవీన్

కోనరావుపేట: పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మధు గోనిక, జక్కని నవీన్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి ఎడ్ల కిషన్, మండల కార్యవర్గం ఐరెడ్డి సాంబరెడ్డి పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల కార్యవర్గం

వీర్నపల్లి: మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం మండల యూత్ కాంగ్రెస్ కార్యవర్గ కమిటీని ఏర్పాటు చేశారు. ఉపాధ్యక్షులుగా అబ్బనవేని నరేశ్, మాలోత్ కిషోర్, ప్రధాన కార్యదర్శిగా గంగాధరి నరేశ్, కార్యదర్శులు సాన అనిల్, భూక్య శ్రీకాంత్, లకావత్ తిరుపతి, కోశాధికారులు, సలహాదారులు మాలోత్ బాబు, గంగాధరి దినేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జోగుల కార్తీక్, గంగాధరి దినేశ్, కడవ శ్రీబాబు, లక్కం బాబు, సాన అనిల్, వీరవేణి సంతోష్, కిషోర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



వేములవాడ: వేములవాడ పట్టణంలోని 2, 3, 9, 10 వార్డుల్లోని యువకులు పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీలో పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, సంఘస్వామి ఆధ్వర్యంలో చేరారు. వారికి డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం వచ్చి 9 ఏళ్లు గడిచిన నిరుద్యోగ యువకులకు నిరుద్యోగ భృతి కల్పించలేదన్నారు. యువతను మోసం చేసిన బీఆర్‌ఎస్ పార్టీకి తగిన రీతిలో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులను అన్ని రంగాల్లో ఆదుకుంటామన్నారు.

మండల సమావేశం వాయిదా

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. 13 మంది ఎంపీటీసీ సభ్యులకు గాను కేవలం నలుగురు మాత్రమే హాజరు కావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ వెంకరమణారెడ్డి ప్రకటించారు. కాగా ఎంపీపీ వెంకట రమణారెడ్డి గురువారం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో మెజారిటీ సభ్యులు సమావేశానికి గైర్హాజరు అయినట్లు తెలుస్తోంది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు రహస్య ప్రాంతంలో ఎంపీటీసీలు సమావేశమైనట్లు మండలంలో చర్చ జరుగుతోంది.

ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా దేవేందర్

ముస్తాబాద్: స్థానిక ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా అబ్రమేని దేవేందర్ ఎన్నికయ్యారు, ఉపాధ్యక్షుడిగా మెంగని రాజు, మేకార్తి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పెద్దిగారి దేవరాజు, కోశాధికారిగా కడమంచి రవి, కార్యదర్శిగా నేరెళ్ల స్వామి, సంయుక్త కార్యదర్శిగా దేవరాజు, కార్యవర్గసభ్యులుగా రాజ్‌కిరణ్‌రెడ్డి, రాజేశ్, రమేశ్, సంతోష్, రాజు ఎన్నికయ్యారు.